

ఆంధ్రజ్యోతి

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.6 , కనిష్ఠం 18.4



కామారెడ్డి
జిల్లా వార్తలు

మంగళవారం 12 నవంబరు 2024



- పూర్తిస్థాయిలో సీసీఐ కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులకు విక్రయం
- జిల్లాలో 8 సీసీఐ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు
- ఇప్పటివరకు ప్రారంభమైంది ఒకటే..
- జిల్లాలో 33వేల ఎకరాలకు పైగా పత్తి సాగు
- 2లక్షల క్వింటాళ్ల మేర దిగుబడులు వస్తాయని అంచనా
- క్వింటాల్ పత్తికి రూ.7521 మద్దతు ధర
- తేమశాతం పేరిట ప్రైవేట్ వ్యాపారుల దోపిడీ
- రూ.7వేలు చెల్లిస్తున్న ప్రైవేట్ వ్యాపారులు

పత్తిపై ప్రైవేట్ పెత్తనం!

కామారెడ్డి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ సీజన్‌లోను పత్తిపై ప్రైవేట్ వ్యాపారులు, దళారులదే పెత్తనం కొనసాగుతోంది. సీసీఐ కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో ప్రారంభం కాకపోవడం, సవాలక్ష నిబంధనలు,తేమశాతం పేరుతో కొనుగోళ్లు జరగకపోవడంతో రైతులు ప్రైవే ట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుంది. దీంతో ప్రైవేట్ వ్యాపారులు, దళారులు చెప్పిన ధరకే రైతులు అమ్ముకుంటున్నారు. దీంతో క్వింటాల్‌కు రూ.500ల వరకు నష్టపోతున్నారు. ఇప్పుడిప్పుడే మార్కెట్‌లోకి రైతులు పెద్ద మొత్తంలో పత్తిని తరలిస్తున్నారు. మరికొన్నిచోట్ల పత్తితీత పనులు కొనసాగుతున్నాయి. మద్నూర్ మార్కెట్‌లోను పత్తిధర అంతంతా మాత్రంగానే వస్తుందని రైతులు చెబుతున్నారు. జిల్లాలోని పలు మండలాల నుంచే కాకుండా పొరుగు జిల్లా అయిన సంగారెడ్డి, మెదక్ నుంచి మద్నూర్ మార్కెట్‌లోకి పత్తిని తరలిస్తున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న వ్యాపారులు రైతులను నాణ్యతలేదని సాకులు చూపుతూ బురిడికొట్టిస్తు తక్కువ ధరకు కొనుగోళ్లు చేస్తున్నారు.

33వేల ఎకరాలకు పైగా పత్తి సాగు

జిల్లాలో పత్తి పంటను రైతులు ఎక్కువగానే సాగుచేస్తుంటారు. మద్నూర్, పెద్దకొడప్‌గల్, జుక్కల్, పిట్లం, నిజాంసాగర్, సదాశివనగర్, గాంధారి, తాడ్వాయి, బిచ్కుంద, రామారెడ్డి తదితర మండలాల్లో వేల ఎకరాలలోనే రైతులుపత్తిని సాగుచేశారు. ఈ ఏడాది 33,395 ఎకరాలలో పత్తిసాగైంది. అయితే వాతావరణం అనుకులించకపోవడంతో పత్తి ఎరబడి ఎండిపోవడంతో దిగుబడులు పూర్తిగా తగ్గాయి. జిల్లాలోని పత్తిరైతులు ఎక్కువగా ఆ పంటపైనే ఆధారపడి సాగుచేస్తున్నారు. అతివృష్టి,అనావృష్టి తెగుళ్ల బెడద, పూత, కాత సమయంలో వర్షాలు కురువడంతో ఆశించిన స్థాయిలో దిగుబడులు రాలేదు. ఈసారి 5 నుంచి 6 క్వింటాళ్లలోపే దిగుబడులు వస్తాయని రైతులు చెబుతున్నారు. ఇలా జిల్లావ్యాప్తంగా 2లక్షల మేర దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు.మరోవైపు కూలీల ఖర్చు కూడా అమాంతంగా పెరిగింది. పత్తితీత కోసం కూలీలు రూ.300 నుంచి రూ.400 డిమాండ్ చేస్తున్నారు.



మద్నూర్ మార్కెట్‌లోకి పత్తి తీసుకొస్తున్న రైతులు

ప్రైవేట్ వ్యాపారులు చెప్పిందే ధర

జిల్లాలోని మద్నూర్ మార్కెట్‌లో పత్తి కొనుగోలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని ఆయా మండలాల నుంచేకాకుండా పొరుగు జిల్లా అయిన సంగారెడ్డి, మెదక్‌ల నుంచి పత్తిని రైతులు మద్నూర్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. మద్నూర్, పెద్దకొడప్‌గల్‌లో 12కు పైగా ప్రైవేట్ జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. సీసీఐ కొనుగోలుకేంద్రాలతో పాటు ఈ జిన్నింగ్ మిల్లులోను రైతులు పత్తిని విక్రయిస్తుంటారు. ఈ ఏడాది ప్రభుత్వం పత్తికి క్వింటాల్‌కు రూ.7 521 మద్దతు ధర ప్రకటించింది. కానీ ఇప్పటివరకు సీసీఐ కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. ఈ సీజన్‌లో 8 సీసీఐ కొనుగోలుకేంద్రాలను ఏర్పాటుచేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ఒకే ఒక కేంద్రాన్ని మాత్రమే ప్రారంభించారు. దీంతో దూర ప్రాంతాల నుంచి పత్తిని తీసుకువస్తున్న రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. నాణ్యమైన పత్తికి కూడా ప్రైవేట్ వ్యాపారులు, దళారులు తక్కువ ధరకే కొనుగోలుచేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వింటాల్‌కు రూ. 500 వరకు తక్కువ ధరకు కొనుగోలుచేస్తున్నారు. రూ.7వేల వరకు క్వింటాల్ పత్తిని కొనుగోలుచేస్తున్నారని దీంతో తాము నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తేమశాతంతో కొర్రీలు

పత్తి కొనుగోళ్లలో ప్రతీ సంవత్సరం తేమ సమస్య తలెత్తుతోంది. చలికాలం ప్రారంభం కావడంతో పత్తిలో తేమశాతం పెరుగుతోంది. సీసీఐ నిబంధనల ప్రకారం తేమశాతం 8 నుంచి 12 శాతంలోపు ఉంటేనే పత్తిని కొనుగోలుచేస్తారు. అంతకంటే అధికంగా ఉంటే క్వింటాల్‌కు ఒక పాయింట్ చొప్పున కోత విధిస్తారు. రైతులు పత్తిని ఆరాబెట్టి తెస్తేనే మద్దతు ధర లభించే అవకాశాలు

(...మిగతా 8వ పేజీలో)



ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ

- జిల్లా నలుమూలల నుంచి వచ్చి కలెక్టర్‌కు అర్జీలు అందించిన ప్రజలు
- దరఖాస్తులను పరిశీలించి వెనువెంటనే చర్యలు తీసుకోవాలి: కలెక్టర్

కామారెడ్డిటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు కలెక్టర్‌కు తమ సమస్యలపై అర్జీలు పెట్టుకున్నారు. ప్రజావాణికి అందిన దరఖాస్తులను వెనువెంటనే పరిశీలించి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. భూ సంబంధిత సమస్యలపై అర్జీలు, రుణాల మంజూరు, వ్యక్తిగత సమస్యలపై దరఖాస్తులను స్వీకరించి వాటి పరిష్కారానికై సంబంధిత అధికారులు దృష్టిసారించాలని సూచించారు. మొత్తం 69 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్‌డీఓ రంగనాథరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీబీపేట కేజీబీవీ ఎస్‌ఓను సస్పెండ్ చేయాలి

బీబీపేట కేజీబీవీ ఎస్‌ఓను సస్పెండ్‌చేయాలని బీవీఎం జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి ఉపాధ్యాయులపై నమోదు అవుతున్న ఫోక్సో కేసులు, బీబీపేట కేజీబీవీ ఎస్‌ఓపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు సరైన సౌకర్యాలు ఏర్పాటుచేయకుండా పురుగుల అన్నం పెడుతూ విద్యార్థులను మానసికంగా ఎస్‌ఓ ఇబ్బంది పెడుతోందని తెలిపారు. గతంలో విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తే స్థానిక అధికారికి ఫిర్యాదు చేసినట్లు చెప్పా రు. విద్యార్థులకు అందించేఆహారంలో రాళ్లు, పురుగులు వస్తున్నాయని పిల్లలు తల్లిదండ్రులకు చెబితే వారిని బెదిరింపులకు గురిచేయడం సిగ్గుచేటని అన్నారు. అదేవిధంగా ప్ర భుత్వ పాఠశాలలో కొన్ని నెలలుగా విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్న ఉపాధ్యాయులపై కేసులు నమోదుకావడం సిగ్గుచేటని అన్నారు.పోక్సోకేసులపై ఒక కమిటిని వేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీవీఎం జిల్లా ఉపాధ్యక్షుడు అర్బన్‌ఖాన్, బుల్లెట్, నాయకులు ప్రభాకర్,శివ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి నంబర్‌లు కేటాయించాలి

భిక్కనూర్‌లోని జంగంపల్లి మల్లుస్వరాజ్యంకాలనీలో గత రెండు సంవత్సరాలుగా నివాసం ఉంటున్న పేద ప్రజలకు విద్యుత్ సౌకర్యం లేక, ఇంటినంబర్‌లు కేటాయించక ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శిచంద్రశేఖర్ అన్నారు. 2008లో పట్టాలు ఇస్తే ఇళ్ల స్థలాలు కేటాయించి లే అవుట్ చేయడం జరిగిందని తెలిపారు. కొందరు ఇళ్లు నిర్మించుకున్నారని మిగిత ప్రజలు నివాసలు ఏర్పాటుచేసుకుని ఉంటున్నారని వారికి వెంటనే తగిన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్‌కు విన్నవించామని తెలిపారు.



దరఖాస్తు చేసేందుకు వచ్చిన ప్రజలు

వయోవృద్ధుల కోసం ఆయుష్మాన్‌భవ



- 70 ఏళ్లుపై బడిన వారికి ఆరోగ్య రక్షణ కోసం కార్డులు ఇవ్వనున్న ప్రభుత్వం
- లబ్దిదారులకు రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం

7లో



మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయశాఖ సలహాదారుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

అబుల్‌కలాం ఆజాద్‌కు ఘన నివాళి

బాన్సువాడటౌన్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ గ్రామీణ మండలం బోర్లం గ్రామంలోని పాఠశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినం పురస్కరించుకుని జాతీయ విద్యాదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ సలహాదారుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సబ్‌కలెక్టర్ కిరణ్మయిలు హాజరై అబుల్‌కలాంకు నివాళ్లు అర్పించారు. అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలను కొనియాడారు. అనంతరం 10వ జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొని ఆటలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ,మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌హెచ్‌ఏ నిర్వహణ కంపు కంపు!

- కంపుకొడుతున్న మూత్రశాలలు, మరుగుదొడ్లు
- కనీస సౌకర్యాలు ఉండవు.. అడిగే వారూ ఉండరు
- పట్టింపు లేని ఎన్‌హెచ్‌ఏ అధికారులు
- కాంట్రాక్టర్లకే వత్తాసు పలుకుతున్న వైనం

నిజాంసాగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపైన ప్రజా అవసరాల నిమిత్తం ఉన్న మరుగుదొడ్లు, మూత్రశాలలు కంపుకొడుతున్నాయి. మరుగుదొడ్లు, మూత్రశాలను వినియోగించుకునేందుకు వచ్చే ప్రజలు అనేక పాట్లు పడుతున్నారు. అధికార యంత్రాంగం నిత్యం రహదారి వెంట రాకపోకలు చేస్తున్నా నిర్వహణపై కనీసం పట్టించుకోవడం లేదు. జాతీయ రహదారి వెంట ఉన్న మరుగుదొడ్లు, ప్రజా అవసరాల కోసం ఉన్నప్పటికీ వాటి నిర్వహణ లేక వినియోగదారులకు దుర్వాసన వ్యాపిస్తున్నప్పటికీ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2017లో ఎన్‌హెచ్‌ఏ రహదారిని 161వ జాతీయ రహదారిగా ఎంపిక చేశారు. ఈ రహదారిని దాదాపు 140 కిలో మీటర్లు దూరంగా గల రోడ్డును నాలుగు వరుసల రోడ్డుగా నిర్మాణం చేశారు. ఈ రహదారి వెంటనే ప్రజా అవసరాల కోసమే కాకుండా భారీ వాహనాలు నిలుపుకునేందుకు ట్రక్ బై లే అవుట్ కూడా ఏర్పాటు చే శారు. కామారెడ్డి - సంగారెడ్డి జిల్లా సరిహద్దుల్లో జాతీయ రహదారి అధికార యంత్రాంగం ఐదు సంవత్సరాల పాటు పనులు చేపట్టి 2022లో జాతీయ రహదారి నిర్మాణం చేపట్టి జాతికి అంకితం చేశారు. 120 కిలో మీటర్ల దూరం గల ఈ రహదారిని మూడు ప్యాకేజీలుగా విభజించి చకచకా రోడ్లు నిర్మాణం పూర్తి చేశారు. 2022లో జాతీయ రహదారి కామారెడ్డి జిల్లా సరిహద్దుల్లో ఉన్న రహదారి వెంటనే మరుగుదొడ్లను, మూత్రశాలలను నిర్మాణం చేపట్టారు.

ఈ రహదారిపైనే ట్రక్‌బై లే అవుట్

ఈ రహదారిపైనే ట్రక్‌బై లే అవుట్ రహదారి కూడా నిర్మించారు. ఆరేడు, బ్రాహ్మణపల్లి, నర్సింగరావుపల్లి, పిట్లం, పెద్ద, చిన్న కొడాప్పగల్‌తో పాటు మహారాష్ట్ర సరిహద్దు అయిన దెగ్లూరు వరకు కుడి, ఎడమ వైపుగల రోడ్ల వెంటనే ప్రజాఅవసరాల కోసం మరుగు దొడ్లు, మూత్రశాలను నిర్మాణంచేశారు. దాదాపు రెండేళ్లపాటు మరుగుదొడ్లు, మూత్రశాలలు ఎంతో శుభ్రంగా ఉంచి న అధికారులు గత ఏడాది కాలం నుంచి పట్టింపు లేన ట్లుగా వ్యవహరిస్తున్నారు. జాతీయ రహదారి వెంటనే వెళ్లే వాహనదారులు మరుగుదొడ్లు, మూత్రశాలల వద్ద వాహ నాలు నిలిపిన ఈ మరుగుదొడ్లు, మూత్రశాలలను వినియోగించుకునేందుకు జంకుతున్నారు. బ్రాహ్మణపల్లి, పిట్లం, ఆరేడు బస్‌స్టేషన్ల వద్ద ప్రజలు వినియోగించుకోకుండా మరు గుదొడ్లకు, మూత్రశాలలకు తాళాలు వేశారు. కామారెడ్డి సరిహద్దుల్లో ఉన్న కల్హేరు మండలం మాసంపల్లి, దేవునిపల్లి, మహాదేవ్‌పల్లిలోఉన్న మరుగుదొడ్లు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. మొదట్లో బస్‌స్టేషన్ల నిర్మాణం చేసిన మరుగుదొడ్లు, మూత్రశాలలో నీరులేక అవిదుర్వాసన వెదజల్లుతున్నప్పటికీ పట్టించుకున్న పాపాన పోవడం లేదని విమర్శలు విని పిస్తున్నాయి. ఈ మరుగుదొడ్లు, మూత్రశాలలను బస్‌స్టేషన్‌ల వద్ద వినియోగించాలంటే జంకుతోనే ఉన్నారు. జాతీయ రహదారి అధికార యంత్రాంగం ప్రతీరోజు పర్యవేక్షణ జరు పుతున్న ఫలితం శూన్యం. పేరుకే జాతీయ రహదారి తప్పా ప్రజా అవసరాలకు సౌకర్యాలు శూన్యమని వాపోతున్నారు. కామారెడ్డి జిల్లా సంగారెడ్డి జిల్లా సరిహద్దుల నుంచి దెగ్లూరు వరకు ఉన్న ఈ రహదారి ఇరువైపులా నిర్మించిన ట్రక్‌బై లేఅవుట్‌తో పాటు మరుగుదొడ్లను నిర్మాణంచేశారు. నీరులేక అవి వినియోగించుకోవాలంటే ప్రజలు దుర్వాసన భరించలేకపోతున్నారు. ఎన్‌హెచ్‌ఏ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు చేపట్టి ప్రజలకు సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించడానికే సర్వే

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



నవీపేటలో కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



ఎన్యూమలేటర్లకు సూచనలు ఇస్తున్న జిల్లా అడిషనల్ కలెక్టర్



ఆర్మూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నవీపేట,నవంబరు11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను చేపట్టడం జరుగుతుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీలో జరిగిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల వారికి విద్య, ఉద్యోగ, సామాజిక, ఆర్థిక రంగాలలో అభివృద్ధి సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు సంబంధించి అసలు, వడ్డీలను తమ ప్రభుత్వం కట్టాల్సి వస్తుందని అన్నారు. వరిపంటకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించడం జరుగుతుందని, అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను త్వరలో మంజూరు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సర్వేకు వచ్చిన అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా తేజస్విన్ అనే సంవత్సరంన్నర బాలుడిని ఎమ్మెల్యే ఎత్తుకుని మంచి అదృష్టవంతుడు అవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, మోస్రా సాయిరెడ్డి, బాల్‌రాజు గౌడ్, మద్దెపల్లి కిషన్ రావు, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

● సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

రెంజల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేపై ఎటువంటి అపోహలు నమ్మవద్దని అడిషనల్ కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం మండలంలోని సాటాపూర్ గ్రామంలో ఇంటింటి కుటుంబ సర్వేను బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో కలిసి పరిశీలించారు. కుటుంబ సర్వే తీరును పరిశీలించారు. ఎన్యూమలేటర్లు కుటుంబ సభ్యుల వివరాలను తప్పులు లేకుండా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతీ గ్రామంలోని ఇంటింటికి వెళ్లి వాస్తవ సమాచారాన్ని సేకరించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో, తదితరులు పాల్గొన్నారు.

● కుటుంబ సర్వేకు ప్రతీ ఒక్కరు సహకరించాలి: అడిషనల్ కలెక్టర్

బోధన్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించి వివరాలు తెలుపాలని, ఎన్యూమలేటర్లు ప్రజలకు నచ్చజెప్పి సర్వే చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్, ఆచన్‌పల్లి, సరస్వతి నగర్‌తో పాటు మండలంలోని పెగడాపల్లి గ్రామంలో కుటుంబ సర్వేను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల వివరాల సేకరణకై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా జరిపిస్తున్న ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు తమవంతు సహకారం అందించాని అన్నారు. సర్వే కోసం ఇళ్లకు వచ్చే ఎన్యూమలేటర్లకు వాస్తవ వివరాలతో కూడిన సమాచారాన్ని అందించాలన్నారు. బోధన్ పట్టణంతో పాటు మండలంలోని పెగడాపల్లి గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని, సమగ్ర సర్వే తీరును పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి ఎన్యూమలేటర్లు వివరాలు ఇంటి యాజమానులకు వివరించి వివరాలు సేకరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అన్ని వర్గాల అభ్యున్నతికి సర్వే ఎంతగానో దోహదపడుతుందన్నారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక ఉపయోగాల కోసం ఈ సర్వే మేలు చేస్తుందన్నారు.ఆయన వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, కమిషనర్ వెంకట నారాయణ, ఎన్యూమలేటర్లు, సంబంధితశాఖ అధికారులు పాల్గొన్నారు.

● కమ్మర్‌పల్లి కులగణన సర్వేను పర్యవేక్షించిన అధికారులు

కమ్మర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య,ఉపాధి,రాజకీయ, కులగణన కుటంబసర్వే మండంలోని గ్రామాల్లో నిరంతరంగా కొనసాగుతున్నది. ఈమేరకు శిక్షణ పొందిన ఆయా గ్రామాలకు కేటాయించిన ఎన్యూమనేటర్లు ఇంటింటి సర్వే కార్యక్రమంలో పాల్గొంటున్నారు. మండలంలో నిర్వహిస్తున్న సర్వేను మండల ఎంపీడీవో రాజశ్రీనివాస్, తమసీల్దార్ అంజనేయులు సోమవారం మండలంలోని కమ్మర్‌పల్లి, హసాకొత్తూర్, చౌట్‌పల్లి, బషీరాబాద్, గ్రామాలలో పర్యటిస్తూ సర్వే పనులను పర్యవేక్షిస్తూ ఎన్యూమనేటర్లకు తగు సూచనలు సలహాలు అందించారు. సర్వేలో ఎలాంటి తప్పులు దొర్లకుడా జాగ్రత్తగా చేపట్టాలని సూచించారు.ఇదిలాఉండగా సమగ్ర ఇంటింటి సర్వేనిమిత్తం ఇళ్లలో అందుబాటులో ఉండి సర్వే నిమిత్తం వచ్చే ఎన్యూమనేటర్లకు సహకరిస్తూ కుటుంబ సభ్యులకు సంబంధించిన పూర్తి వివరాలను నమోదుచేయించుకోవాలని సూచించారు. వీరివెంట ఏపీఎం కుంట గంగారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సర్వే సిబ్బంది ఉన్నారు.

● సమగ్ర కుటుంబసర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

భీమ్‌గల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబసర్వేను తప్పులు లేకుండా పకడ్బం దీగా నిర్వహించాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ ఎన్యుమారేటర్‌లకు సూ చించారు. సోమవారం మండలంలోని మెండోరా, దేవన్‌పల్లి, పల్లికొండ గ్రా మాలలో సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియను ఎంపీడీవో పరిశీలించారు.ఈ సర్వేకు కుటుంబ సభ్యులు సహకరించాలని అన్నారు. ఆయన వెంట ఆయా గ్రామాల కార్యదర్శులు, సర్వేసిబ్బంది, తదితరులు ఉన్నారు.

● ఆర్మూర్‌లో కొనసాగుతున్న సమగ్ర కుటుంబసర్వే

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మండలంలోని వివిధ గ్రామాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతుంది. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో సర్వేలో 105మంది ఎన్యుమారేటర్లు ఇంటింటికి వెళ్ళి కుటుంబ వివరాలను సేకరిస్తున్నారు. సర్వే బుక్‌లో సేకరించిన వివరాలను అధికంగా ఉండడంతో ఒక్కోక్క ఇంటి వద్ద కనీసం అరగంట సేపు సమయం పడుతోంది. ఎన్యుమారేటర్లు నిర్వహిస్తున్న సర్వేలో సూపర్‌వైజర్‌లు, అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

● సమగ్ర సర్వేను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని జరుగు తున్న సమగ్ర కుటుంబ సర్వేను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేను ఆయన 19, 20వార్డులలో పరిశీలించారు. ఆయన వెంట సూపర్‌వైజర్‌లు బాల్‌రాజ్, కృష్ణయ్యలు ఉన్నారు.

● బాల్కొండ, ముప్కాల్‌ల్లో కొనసాగుతున్న సమగ్ర సర్వే

ముప్కాల్:బాల్కొండ, ముప్కాల్ మండలాల్లో కొనసాగుతున్నఇంటిం టి సర్వే కొనసాగుతుంది. ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి జరుగుతున్న సమగ్ర సర్వేను తప్పులు లేకుండా పకడ్బందీగా కొనసాగించాలని ఎన్యుమారేటర్‌లకు సూచించారు.

'విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహించాలి'



మోకన్‌పల్లి కేజీబీవీలో మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నవీపేట,నవంబరు11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మోకన్‌పల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి సబ్జెక్టులో 80శాతానికి పైగా మార్కులు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పాఠశాలలో నెలకొన్న నీటి కొరత, అదనపు గదుల నిర్మాణం, కిటికీలకు జాలీల ఏర్పాటు, బాత్‌రూమ్‌ల మరమ్మత్తుల వంటి సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఈవో అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, పాఠశాల ప్రత్యేకాధికారిణి కవిత, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

ఆర్మూర్‌రూరల్,నవంబరు11(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో తొలగించిన మధ్యాహ్న భోజన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఎంఆర్‌సీ ఎదుట ధర్నా నిర్వహించారు. గత కొన్నేళ్లుగా పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట చేస్తున్న వారిని ఉన్నఫలంగా విధుల నుంచి తొలగించడం అన్యాయమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్‌జహాన్, పల్లపు వెంకటేష్ అన్నారు. సంఘటన స్థలానికి సీఐ సత్యనారాయణగౌడ్, ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి చేరుకొని సముదాయించారు. అనంతరం సీఐటీయూ నాయకులు తహసీల్దార్ గజానన్‌కు, ఎంఈవో రాజగంగారాంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కుతాడి ఎల్లయ్య, రవి, సాయిలు, కొండ గంగాధర్, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి: రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు 10వేల గౌరవ వేతనం అందించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికుల మండల స్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు చక్రపాణి, విఠల్ గౌడ్, వీరేశం, అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్లలోని కేజీబీవీ ఘటనపై విచారణ



ఎంఈవోతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీలత

ఏర్గట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల భవనంపై నుంచి అంజలి అనే విద్యార్థిని రెండవ అంతస్తు నుంచి పడి గాయాల పాలు కాగా సోమవారం పాఠశాలను తహసీల్దార్ శ్రీలత జరిగిన ఘటనపై విచారణ జరిపారు. విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వారి రక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతయని, ఇలాంటి ఘటనలు జరగకుండ చూడాలని ఎంఈవో ఆనంద్ రావుకి సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కృష్ణచారి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సదానంద్ పాల్గొన్నారు.

ఇద్దరికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష

బోధన్‌రూరల్,నవంబరు11(ఆంధ్రజ్యోతి): బోధన్ కోర్టులో సోమవారం ఇద్దరు వ్యక్తులకు హత్యాయత్నం కేసులో ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కోర్టు న్యాయాధికారి తీర్పు వెలువరించారని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. 31-05-2021రోజున రాత్రి 7:30గంటల ప్రాంతంలో శక్కర్‌నగర్‌లోని సులభ్ కాంప్లెక్స్ వద్ద సయ్యద్ ఆస్గర్ అనే వ్యక్తి కాలకృత్యాలు తీర్చుకోవడానికి బయలకు వెళ్లినప్పుడు సతీష్, జావీద్ అనే ఇద్దరు వ్యక్తులు కల్లు సీసాతో కడుపులో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డారని వివరించారు. సోమవారం బోధన్ కోర్టులో కేసు యొక్క పూర్వాపరాధాలు పరిశీలించగా సాక్ష్యాధారాలు నిరూపణ కావడంతో బోధన్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి అజయ్‌కుమార్ హత్య యత్నానికి పాల్పడ్డ జావీద్, సతీష్‌లకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పును వెలువరించారని వివరించారు.

మహాలక్ష్మికాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఆర్మూర్‌టౌన్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాలక్ష్మీ కాలనీలో సోమవారం నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. కాలనీలో లోవోల్టేజీ సమస్య ఉండడంతో ఉన్నతాధికారుల సూచన మేరకు 100కెవి ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి 160కెవి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్టు విద్యుత్ ఏఈ అశ్రితరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ సంతోష్‌నాయక్, సబ్‌ఇంజనీర్ తదితరులు పాల్గొన్నారు.

విజయ్ హైస్కూల్‌లో 43వ టాలెంట్ షో

● హాజరైన సినీనటి యాంకర్ ఉదయభాను, రచయిత్రీ సుశీల

పెర్కిట్, నవంబరు11(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ పట్టణంలోని విజయ్ హైస్కూల్‌లో 43వ టాలెంట్ షోను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీనటి యాంకర్ ఉదయభాను, గౌరవ అతిథిగా ప్రొఫెసర్ రచయిత్రీ సీహెచ్.సుశీల పాల్గొన్నారు. విద్యార్థిని విద్యార్థులకు పాఠశాలలో ఆటలలో, పోటీ పరీక్షలలో ప్రతిభ కనబర్చిన వారికి మెమోంటోలు, స్కూల్ టాపర్‌కు డి.ఎల్‌విన్‌కు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం ఇరువురికి విజయ్ హైస్కూల్ యాజమాన్యం ఉదయభాను, సీహెచ్.సుశీలను సన్మానించారు. . ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవిత దివాకర్, కిరణ్‌బాల, వసంత, ప్రభ, పాఠశాల అధ్యాపక బృందం, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.



సినీనటి యాంకర్ ఉదయభానును సన్మానిస్తున్న విజయ్ హైస్కూల్ యాజమాన్యం

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు జాకోర విద్యార్థిని

వర్ని,నవంబరు11(ఆంధ్రజ్యోతి): వర్ని మండలం జాకోర జిల్లా పరిషత్ విద్యార్థిని గిరి అక్షిత రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైంది. 68వ ఎస్‌జీఎఫ్‌యూ 17బాలికల రాష్ట్రస్థాయి హాకీ పోటీలు గ్లోబల్ స్కూల్ దాస్ నగర్‌లో మూడు రోజుల పాటు జరుగనున్నాయి. ఈ పోటీలకు అక్షిత ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయులు అలీం హర్షం వ్యక్తం చేశారు. వ్యాయమ ఉపాధ్యాయులు స్వామి కుమార్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు, అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు.

పేట్‌సంగెంలో వాలీబాల్ రాష్ట్రస్థాయి ఎంపికలు

గాంధారి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్ 14 వాలిబాల్ ఎంపికలను మండలంలోని పేట్‌సంగెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించినట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు లక్ష్మన్‌రాథోడ్ తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన బాలబాలికలు పాల్గొన్నారని తెలిపారు. ఈనెల 16 నుండి 18 వరకు చేగుంటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయని తెలిపారు.ఎంపికలో బాలురు 12,బాలికలు 12 మంది ఎంపికఅయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా వ్యాయమ ఉపాధ్యాయసంఘం బాధ్యులు విద్యసాగర్‌రెడ్డి, సురేష్, గంగామోహన్, శ్రీనివాస్,యాదగిరి,బాలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శక్తిపై అధికారుల పొలంబాట

బోధన్‌రూరల్,నవంబరు11(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని ఊట్‌పల్లి శివారులోని పంట పొలాల్లో సోమవారం విద్యుత్ శాఖ అధికారులు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ టెక్నికల్ డీఈ రమేష్ మాట్లాడుతూ.. విద్యుత్ శక్తిపై రైతులకు అవగాహన కల్పించడం కోసం పొలంబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ బోధన్ డీఈ ముక్తార్ హైమద్, ఎడపల్లి ఏడీఈ ప్రభాకర్, ఏఈ మారుతి, లైన్ ఇన్స్‌స్పెక్టర్ శివప్రసాద్, లైన్‌మెన్‌లు రామకృష్ణ, వెంకటేష్, మహేందర్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి చెరువులో చేప పిల్లల విడుదల

కోటగిరి,నవంబరు11(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలోని దామర చెరువులో సోమవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో 92,780 చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ ఛైర్మన్ హన్మంతు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వంద శాతం రాయితీపై చేప పిల్లలను అందించడం జరుగుతుందన్నారు. మత్స్యకారుల జీవనోపాధిని పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ గంగాధర్, నాయకులు బర్ల మధు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు

ముప్కాల్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): బాల్కొండ, ముప్కాల్ మండలాల్లో కార్తికమాసం సోమవారం కావడంతో శైవక్షేత్రాల్లో భక్తులతో కిటకిటలాడాయి. కార్తిక మాసానికి ఒక విశిష్టత ఉందని, సోమవారం అత్యంత భక్తిశ్రద్ధతో ఉపవాస దీక్షలతో ఉండి సైవక్షేత్రాలను దర్శించుకుంటే శుభాలు జరుగుతా యని భక్తుల నమ్మకం. కార్తిక సోమవారం కావడంతో నది తీరాలకు వెళ్ళి పుణ్యస్నానాలు ఆచరించి కార్తిక దీపాలను వదిలి అనంతరం శివాలయంలో దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి దీపోత్సవాలు నిర్వహించారు.

చెరువులో పడి వ్యక్తి ఆత్మహత్య

నవీపేట,నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరికి చెందిన గౌరు ప్రదీప్(38)అనే వ్యక్తి ఆదివారం రాత్రి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. ప్రదీప్ గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడని, మద్యం సేవించడం మానివేయాలని పెద్ద మనుషులతో చెప్పించిన అతడు తన పద్ధతి మార్చుకోలేదని అన్నారు. ఆదివారం రాత్రి మద్యాన్ని సేవించిన ప్రదీప్ తాను జలాల్‌పూర్ శివారులోని పోతడి కుంట చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నానని భార్యకు ఫోన్ చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. బైక్‌పై వెళ్లిన అతడు అదే రాత్రిజలాల్‌పూర్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోగా అతడి మృతదేహం సోమవారం లభ్యమైందని ఎస్‌ఐ పేర్కొన్నారు.మృతుడికి భార్య మీనా, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దివ్యాంగులకు రూ.10వేల పింఛన్ ఇవ్వాలి

బోధన్‌రూరల్,నవంబరు11(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగులకు 10వేల పింఛన్ అందించాలని సోమవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ అధ్యక్షులు యేశాల గంగాధర్ మాట్లాడుతూ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేలో 21రకాల వికలాంగుల వివరాలు సేకరించాలని కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బోధన్ సబ్ కలెక్టర్‌కు జిల్లా కమిటీ తరపున వినతిపత్రం అందించడం జరిగిందన్నారు. కుటుంబ యాజమాని, కుటుంబ వ్యక్తిగత వివరాలు సేకరించడంతో పాటు నెంబర్ కాలంలో మీరు దివ్యాంగులా అని అడిగారని, వికలాంగుల 2016 హక్కుల పరిరక్షణ చట్టం 21రకాల వైకల్యాలను గుర్తించిందన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శితో పాటు దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

అబుల్ కలాం ఆజాద్ అడుగు జాడల్లో నడవాలి



కోటగిరిలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్ రావు

కోటగిరి,నవంబరు11(ఆంధ్రజ్యోతి): భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అడుగుల్లో ప్రతి ఒక్కరు నడవాలని కోటగిరి ఎంఈవో శ్రీనివాస్ రావు సూచించారు. కోటగిరి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాధర్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు బర్ల సాయిలు, ప్రధాన కార్యదర్శి ఉదయ్ చందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అర్షద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: నేటి యువత మౌలానా అబుల్ కలాం ఆజాద్ అడుగు జాడల్లో నడవాలని బోధన్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ గౌసోద్దీన్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని మైనారిటీ పాఠశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి యువత మౌలానా అబుల్ కలాం ఆజాద్ అడుగు జాడల్లో నడవాలన్నారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్య అభివృద్ధి కోసం అనేక విధాలుగా కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్, ప్రిన్సిపాల్ వహీద్, సనా పటేల్, మైనారిటీ పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: భారతరత్న కేంద్ర తొలి విద్యశాఖ మంత్రి అబుల్ కలాం అజాద్ జయంతి వేడుకలను సోమవారం బాల్కొండ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ చందన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేశానికి చేసిన సేవలు, దేశ విద్య వ్యవస్థను తీర్చిదిద్దిన మహానీయుడని కొనియాడారు. 11ఏళ్ల విద్యశాఖ మంత్రిగా అజాద్ ఎనలేని సేవలు చేశారన్నారు. జాతీయ విద్యావిదానం అమలు చేశారని, రచయితగా, కవిగా, విద్యవేత్తగా, తత్వవేత్తగా, రాజకీయ వ్యక్తిగా సేవలు అందించిన మహాముఖ ప్రజ్ఞాశాలి అని కీర్తించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సయ్యద్ మజారుద్దిన్, మార్కజ్ కమిటీ జాయింట్ సెక్రెటరీ సయ్యద్ శంశోద్దిన్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మోర్తాడ్: భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలాన అబుల్ కలాం అజాద్ జయంతి వేడుకలను మైనారిటీ నాయకులు ఘనంగా నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలోని మైనారిటీ షాదిఖానలో జిల్లా మాజీ వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ నజీర్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పుప్పాల అశోక్, వీడీసీ అధ్యక్షుడు జంగం అశోక్, ఎఎంసీ డైరెక్టర్ మహిపాల్‌రెడ్డి, విక్రంగౌడ్, జమాల్, హర్షద్, మైనారిటీ సంఘ పెద్దలు, ఉర్దూ జర్నలిస్టులు పాల్గొన్నారు.

రెంజల్: జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో సోమవారం మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో ఆంజనేయులు మాట్లాడుతూ. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హర్షియా నజ్మా, పాల్గొన్నారు.

15 వరకు ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్‌లు

ఆర్మూర్‌టౌన్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ మొదటి సంవత్సరం చేరుటకు ఈనెల 15వ తేదీ వరకు అడ్మిషన్‌లు పొందడానికి అవకాశం కల్పిస్తున్నట్టు డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వేణు ప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 7382929785నెంబర్‌కు సంప్రదించాలని ఆయన తెలిపారు.

లింబాద్రిగుట్ట జాతరకు ప్రత్యేక బస్సులు

పెర్కిట్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణం నుంచి భీమ్‌గల్ లింబాద్రిగుట్టకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని ఆర్మూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ పి.రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14నుంచి 17వ తేదీ వరకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని, ప్రయాణికుడే ఆర్టీసీ బస్సులలో ప్రయాణించి సురక్షితంగా సుఖవంతంగా ఉండాలని ఆయన తెలిపారు.

అక్రమ కోకాలు, పండ్ల దుకాణాల తొలగింపు

ఆర్మూర్‌టౌన్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తబస్టాండ్ ప్రాంతంలో రోడ్డు అక్రమించి ఉన్న కోకాలు, పండ్ల బండ్లను మున్సిపల్ అధికారులు, స్థానిక పోలీసులు తొలగించారు. కొత్తబస్టాండ్ ప్రాంతంలో చిరు వ్యాపారులు రహదారిని అక్రమించుకొని ఇష్టరాజ్యంగా కోకాలు, పండ్ల దుకాణాలు నిర్వహిస్తున్నారు. మడిగెలలో వ్యాపారులు చేసుకొనే వారు తమ దుకాణాల ముందు పండ్ల దుకాణాలు, ఇతర దుకాణాలకు అనుమతినిస్తూ వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తుంటారు. దీని వల్ల రోడ్లు ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.ఈ కార్యక్రమంలో టీపీవో అంజనేయులు. ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి, ఎఎస్సై లక్ష్మణ్, చిన్నయ్య, సానిటరీ ఇన్స్‌పెక్టర్ గజానంద్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



ఆర్మూర్ ఆర్టీసీ ప్రాంతంలో జేసీబీతో కోకాలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

రేషన్ బియ్యం పట్టివేత

బిచ్కుంద,నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పీడీఎస్ బియ్యాన్ని ప్యాసింజర్ ఆటోలోతరలిస్తుండగా రాజుల్ల పెట్రోల్ పంపు వద్ద పట్టుకున్నట్లు ఎస్‌ఐ మోహన్ రెడ్డి తెలిపారు. 20 బస్తాల బియ్యంను స్వాధీనం చేసుకుని తరలిస్తున్నవారిపై కేసులు మోదుచేశామని ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మండలంలోని ఖత్‌గావ్ మంజిర పరివాహక ప్రాంతం నుండి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ మోహన్‌రెడ్డి తెలిపారు. అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ యాజమాని, డ్రైవర్లపై కేసు నమోదుచేసి ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

జోరుగా కొనసాగుతున్న రోడ్డు పనులు

దోమకొండ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి):దోమకొండ నుంచి బిక్కనూర్ వరకు తారు రోడ్డు నిర్మాణంకు పనులు జోరుగా కొనసాగుతున్నాయి. దోమకొండ, గొట్టిముక్కుల, లక్ష్మీదేవునిపల్లి, బిక్కనూర్ వరకు సుమారు 8 కిలోమీటర్ల దూరం రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. మరి కొన్ని రోజుల్లో రోడ్డు పనులు పూర్తి కానున్నట్లు సిబ్బంది తెలిపారు.

విధుల్లో చేరిన దోమకొండ ఏవో

దోమకొండ నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):దోమకొండ మండల వ్యవసాయాధికారిణి మణిదీపిక సోమవారం విధుల్లో చేరారు. ఇటీవలే ప్రభుత్వం వ్యవసాయశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయగా ఆమె దోమకొండ ఏవోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఏఈవోలు క్రిష్టారెడ్డి, మాన్యాష, సెంటర్ నిర్వహకులు ప్రమోద్, గూలాం, రైతులు పాల్గొన్నారు.

వెల్మల్‌లో సుభాష్ పత్రీజీ జన్మదిన వేడుకలు

నందిపేట, నవంబరు11(ఆంధ్రజ్యోతి): నందిపేట మండలం వెల్మల్ గ్రామంలో సోమవారం జగద్గురు బ్రహ్మర్షి సుబాష్ పత్రాజీ జన్మదిన వేడుకలను పీఎస్ఎస్ఎం నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీరమిడ్ మాస్టర్ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ప్రతీఒక్కరు ధ్యానం చేసి పిరమిడ్ శక్తిని ఉపయోగించి శాఖహారాన్ని భుజించి జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణరెడ్డి, జిల్లా బాధ్యులు, రిటైర్డు డీపీవో బొడ్డు దయానంద్, లక్ష్మణ్, చిన్నయ్య, నరేంధర్, భోజన్న, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

గడుగు గంగాధర్‌ను సన్మానం

జక్రాన్‌పల్లి, నవంబరు11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్‌ను సోమవారం జక్రాన్‌పల్లి మాజీఎంపీపీ కె.అనంత్‌రెడ్డి కలిశారు. అనంతరం గడుగు గంగాధర్‌ను మాజీఎంపీపీ కె.అనంత్‌రెడ్డి శాలువ, బోకెతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం..శ్రీ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

భీమ్‌గల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దక్షిణ బద్రినాథ్‌గా పేరు పొందిన నింబాచల క్షేత్రంపై శ్రీలక్ష్మీనర్సింహ స్వామి కల్యాణం సోమవారం ఆలయ ధర్మకర్త నంబి పార్థసారథి విజయసారథి ఆధ్వర్యంలో ఘనంగా చేపట్టారు. నిజామాబాద్ జిల్లాలోని ప్రసిద్ధి చెందిన నింబాచల క్షేత్రంపై శ్రీవారి బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా దేవదేవుని కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుని కల్యాణం తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు.



లింబాద్రిగుట్టపై స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



లింబాద్రిగుట్టపై స్వామివారి కల్యాణం తిలకిస్తున్న మహిళలు

శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం..

శ్రీలక్ష్మీనర్సింహస్వామి మూల విరాట్ కల్యాణ మహోత్సవం గర్భాలయంలో ఉదయం 8.30 గంటలకు ప్రధాన యాగ్నికులచే జరిపారు. తదుపరి స్వర్ణాలంకార భూషితులైన శ్రీలక్ష్మీ నర్సింహుని ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాలు మొగుతుండగా గర్భాలయం నుంచి కల్యాణ మండపంనకు పుష్పమాలికాలతో అలంకరించిన పల్లకిలో భక్తజనం గోవింద నామస్మరణతో తోసుకొచ్చారు.

కల్యాణ క్రతువు..

కల్యాణోత్సవంలో మొదటిదైన కలశపూజ, విశ్వక్సేన పూజ నిర్వహించి శ్రీలక్ష్మీ నర్సింహులకు రక్షా బంధనం గావించారు. మంత్ర సంస్కార మొనర్చిన యగ్నోపవిత ధారణ గావించి ఆయన పాద చిహ్నం గల శఠగోపమునకు ప్రత్యద్విష్ణు అనే మంత్రంతో పాద ప్రక్షాళన గావించి స్నానమొనరిచారు. పెరుగు, తేనె కలిపిన మధు పర్కాన్ని స్వామి వారికి తాగించారు.

కన్యాదాన సంకల్పం..

కన్యాదానం చేసిన పితరులు నరకాన్ని వీడి పుణ్యలోకం చేరుకుందురు. కన్యాదాన వైభవం తిలకించిన సమస్త భక్తులకు పుణ్యలోక ప్రాప్తి దొరుకుతుందని అర్చకులు వివరించారు. కన్యాదానంలో భాగంగా శ్రీలక్ష్మీనర్సింహుని దోసిలిపై శ్రీ లక్ష్మీదేవి దోసిలి నుంచి మనుభావనచే అర్చకులు తమ దోసిలిలో కన్యాం కనక సంపన్నాం అనే శ్లోకాలు పటిస్తూ సంతత ధార జలాలతో స్వామి వారికి అమ్మవారిని కన్యాదానం చేశారు.

తదేవ లగ్నం సుదీనం తదేవ..

శ్రీలక్ష్మీనర్సింహుని శ్రీలక్ష్మీదేవిని ఒకరికి ఎదురుగా స్వస్తిక చిన్నాహాలు గల కల్యాణ పీఠాలపై కూర్చుండ బెట్టారు. ఇద్దరి మధ్య తెర ఉంచి మంగళవాయిద్యాలు మోగుతుండగా తదేవ లగ్నం సుదిలం తదేవ మొదలగు వివాహ మంగళా ష్టకములు జపిస్తూ ఆయన పాదములైన శఠ గోపంపై ముత్యాలతో కూడిన తలంబ్రాలను సమర్పించారు. విశ్వ సృష్టి లయ కారకుడైన శ్రీలక్ష్మీ నారాయణుని మీద తలంబ్రాలు వేసే అధికారం మానవ మాత్రులకు లేనందున ఆయన పాదాలపై తలంబ్రాలు సమర్పించారు.

ధృవంతే రాజా..

ధృవంతే రాజా అనుమంత్రముచే శఠ గోపముపై జీలకర్ర బెల్లం కలిపిన ముద్దను ప్రధాన అర్చకుడు సమర్పించారు. పట్టువస్త్రాలు, పూల బాషింగాలు, బంగారు బాషింగాలు చేర్చి మంగళవాయిద్యాలు మొగుతుండగా స్వామికి సమర్పణ చేశారు.

మాంగల్యం తంతు నానేన..

సంకల్ప యుక్తంగా మాంగల్య పూజ గావించారు. సుహాసినులు, సమస్త భక్తులు పవిత్రమైన మాంగళ్యం మొక్కుతుండగా శుభప్రదమైన మంగళవాయిద్యాలు మోగుతుండగా మాంగల్య తంతునానేన అను శ్లోకం వేద పండితులు పట్టించుచుండగా శ్రీలక్ష్మీనర్సింహుల వారు తన దేవెరీయైన అమ్మవారి మెడలో మంగళ సూత్రం కట్టారు. వధూవరులు ఒకరి శిరస్సుపై ఒకరు దోసిలితో అక్షింతలు పోసుకున్నారు. దీనిని అక్షత దోపణం అంటారు. అర్చకులు శ్రీస్వామి శఠగోపంపై మంత్రాలు ఉచ్చరిస్తూ శ్రీ స్వామి తలపున అక్షింతలు సమర్పించారు. తదుపరి బ్రహ్మముడి వేశారు. ఆశీర్వచనాది పనసలను చదివి కల్యాణం తిలకించిన భక్తులకు ప్రసాద అక్షింతలు ఇచ్చి అర్చకులు ఆశీర్వదించారు. కల్యాణ వేడుకల అనంతరం రాత్రికి వివాహ స్థాలీపాక హోమం నిర్వహించారు. శ్రీలక్ష్మీ నర్సింహుని కల్యాణ మహోత్సవం కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



పల్లకీసేవలో శ్రీలక్ష్మీనర్సింహస్వామివారు



లింబాద్రిగుట్టపై క్యూలో నిల్చున్న భక్తులు



శ్రీలక్ష్మీనర్సింహుని కల్యాణోత్సవాన్ని జరుపుతున్న వేదపండితులు



లింబాద్రిగుట్టపై ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

లింబాద్రిగుట్ట బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ప్రముఖులు

భీమ్‌గల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింబాద్రిగుట్టపై కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో సోమవారం లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా స్వామివారిని దర్శించుకున్నారు. లింబాద్రి గుట్టపై జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ఆలయ ధర్మకర్త నంబి పార్థసారథి, విజయసారథిలు ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణకు శాలువతో సన్మానించారు. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సతీమణి నీరజారెడ్డి కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో లక్ష్మీనర్సింహస్వామి వారికి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సతీమణి నీరజారెడ్డి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు.



లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సతీమణి నీరజారెడ్డి

వయోవృద్ధుల కోసం
ఆయుష్మాన్ భవ



వృద్ధుల కోసం హెల్త్ కార్డు

మద్నూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భవ అనే పథకాన్ని ప్రారంభించింది. ప్రస్తుతం నిరుపేదలకు ఉచిత వైద్యం కోసం కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ కార్డులు ఇస్తున్న రీతిలోనే ప్రత్యక్షంగా 70 ఏళ్ల పైనున్న వారి ఆరోగ్య రక్షణ కోసం కూడా కార్డులను ఇవ్వబోతుంది. ఈ కార్యక్రమంలో గత నెల 23వ తేదీ నుంచి అమలు చేస్తుండగా రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము వర్చువల్‌గా ఈ కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా ప్రారంభించారు. ఐదు లక్షల మేరకు ఉచిత ఆరోగ్య పథకాన్ని ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన అందుబాటులోకి తీసుకొచ్చారు. 70 ఏళ్ల పైనున్న వారు ఈ ఆయుష్మాన్ భవ పథకం కింద లబ్ధి పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా సేవలు అందిస్తుంది. ఈ పథకం కింద 1835 రకాల వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు. కేంద్రం ప్రస్తుతం ప్రారంభించిన ఆయుష్మాన్ భవ పథకాన్ని వృద్ధులకు కేంద్రం అందజేస్తుంది. దీంతో ఈ పథకం కింద ఆసుపత్రిలో వైద్య పరీక్షలు, చికిత్స, ఇంటెన్సివ్ కేర్ తదితర సేవలను పొందవచ్చు. ఉచితంగా మందులు పోషక ఆహారం సైతం అందజేస్తారు. ఈ పథకం కోసం వృద్ధులు పూర్తి వివరాలతో వెబ్‌సైట్‌లోను దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

● హెల్త్ ఇన్సూరెన్స్ ఉన్న వారికి కూడా...

ఇప్పటికే ఆయుష్మాన్ కార్డు కలిగి ఉన్న వృద్ధులు ఆయుష్మాన్ పోర్టల్ లేదా యాప్‌లో మళ్లీ దరఖాస్తు చేసుకుని కొత్త కార్డు కోసం ఈ కేవైసీ పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రైవేట్ హెల్త్ ఇన్సురెన్స్ పాలసీలు, లేదా ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ స్కీం పొందుతున్న సీనియర్ సిటిజన్‌లు కూడా ఈ పథకం కింద ప్రయోజనాలు పొందేందుకు అర్హులు. కేంద్ర ప్ర భుత్వ ఆరోగ్య పథకం ఎక్స్ సర్వీస్‌మెన్, కంట్రిబ్యూటర్ హెల్త్ స్కీమ్, ఆయుష్మాన్, సెంట్రల్ ఆర్మీ పోలీస్ ఫోర్సు వంటి ఇతర పబ్లిక్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్‌లను ఉపయోగిస్తున్న 70 ఏళ్ల పైనున్న సీనియర్ సిటిజన్ సైతం పథకం లేదా ఆయుష్మాన్ భారత్ స్కీమ్‌లలో ఏదో ఒక దాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది.

● ఇంటి వద్దే ఆరోగ్య పరీక్షలు

ఆయుష్మాన్ భారత్ కింద పేర్లు నమోదైన వయో వృద్ధులు ఇళ్లకు వెళ్లి వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల వివరాలను ఆయుష్మాన్ భవ ఖాతాలో నమోదు చేస్తారు. ఆసుపత్రికి వెళితే వాటిని పరిశీలించి డాక్టర్లు వైద్యం అందజేస్తారు. ఏదైనా సందర్భంలో వేరే ఆసుపత్రులకు వెళ్లి రోగుల వద్ద పాత వైద్య రిపోర్టులు లేకపోయినా ఆయుష్మాన్ భవ హెల్త్ ఖాతా సంఖ్య ఆధారంగా వైద్యులు చికిత్స అందజేస్తారు.



వైశ్యా భవన్ ఎదురుగా రోడ్డు పక్కన చెత్త వేస్తున్న దృశ్యం



3వ వార్డు పరిధిలో ఖాళీ స్థలంలో పేరుకుపోయిన మురికి నీరు, పిచ్చి మొక్కలు

ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో పారిశుధ్యం అస్తవ్యస్తం

● పట్టించుకోని అధికారులు

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఎల్లారెడ్డి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పారిశుధ్యం లోపంతో అస్తవ్యస్తంగా తయారైంది. పారిశుధ్య పనులను పర్యవేక్షించాల్సిన మున్సిపల్ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదని విమర్శలు వ్యక్త మవుతున్నాయి. ప్రధానంగా పట్టణంలోని పలు కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక మురుగు నీరు నిలిచి కంపుకొడుతున్నట్లు కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇళ్ల మధ్యలో మురుగు నీరు నిలువ ఉండటంతో దోమల బెడద అధికమై ప్రజలు మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, టైఫాయిడ్‌తో పాటు తదితర వ్యాధుల బారిన పడుతున్నారు. వర్షాకాలం ముగిసిన పట్టణంలో ప్రజలు ఇప్పటికీ సీజనల్ వ్యాధులతో బాధపడుతూనే ఉన్నారు. పట్టణంలోని పారిశుధ్య పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పట్టణంలోని మూడవ వార్డు కాలనీలో ఖాళీ స్థలంలో మురికి నీరు చేరడం వల్ల దోమలతో ఇబ్బదులు ఎదుర్కొంటున్నారు. పదో వార్డు పరిధిలో వైశ్యా భవన్ ముందు ప్రాంతంలో ఖాళీ స్థలాలలో వ్యర్థాలు వేయడం, అదేవిధంగా 11, 12వ వార్డు పరిధిలో మురికి కాలువలు శుభ్రం గా లేకపోవడంతో సహకార సంఘం పక్కన రోడ్డు మీద మురికి నీరు ప్రవహిస్తుంది. అంతేకాకుండా ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిలిచి ప్రాంతాలు కంపు కొడుతున్నాయి. కాలనీ వాసులు పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు, స్వచ్ఛతాహీ సేవా, డ్రైడే డ్రై డే కార్యక్రమాలు నిర్వహించినప్పుడు మాత్రమే కొన్ని కాలనీలలో మున్సిపల్ అధికారులు హంగామా చేసి శుభ్రం చేసి ఉన్నతాధికారుల దృష్టిలో పడేలా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతే తప్పా మున్సిపాలిటీలో పారిశుధ్యం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు పారిశుధ్యంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



రోడ్డు పక్కన చెత్తాచెదారం



పాతబస్టాండ్ సమీపంలో రోడ్డుపై సంచరిస్తున్న కుక్కలు



హుస్నాబాద్‌గల్లీలో రోడ్డుపై అడ్డంగా ఉన్న కోతుల మంద

ఆర్మూర్‌లో కుక్కలు, కోతులతో అవస్థలు

● బయటకు వెళ్లాలంటే జంకుతున్న ప్రజలు

ఆర్మూర్‌టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని కుక్కలు, కోతులతో ప్రజలు అవస్థలు పడుతూ భయాందోళనకు గురవుతున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. చిన్న పిల్లలు స్కూల్ వెళ్లేటప్పుడు ఎక్కడ ఏ కుక్కనో కోతియే కాటు వేస్తుందని తల్లిదండ్రులు భయపడుతూ బడికి పంపిస్తున్నారు. అలాగే తల్లిదండ్రులు కర్ర లేకుండా వీధుల్లో తిరగలేని దుస్థితి ఏర్పడింది. గతంలో కుక్క కాటుకు, కోతి కాటుకు వంచన పడ్డవారు చాలా మంది ఉన్నారు. కాలనీలోని ప్రధాన కూడలిలలో కుక్కలు మాటు వేయగా ఇళ్లపై కోతులు వేచి చూస్తున్నాయి. ప్రతీనెల సుమారు 250 మందికి పైగా కుక్క, కోతిల కాటువల్ల చికిత్స చేయించుకుంటున్నారు. ప్రతీ వార్డులోని ప్రధాన కూడలిలో సుమారు పది నుంచి 20కుక్కలు ఉండగా, ఇళ్లపైన సుమారు వందకు పైగా కోతులు ఉండడంతో ప్రజలు ఏమి చేయలేని స్థితిలో నిమ్మకుండిపోతున్నారు. మున్సిపల్‌లో పలుమార్లు ఫిర్యాదు చేసిన అధికారులు గాని, నాయకులు గాని పట్టించుకున్న దాఖలాలు లేవు. కుక్కలను జిల్లా కేంద్రంలోని ఏబీసీ సెంటర్‌కు తరలించి శస్త్రచికిత్సలు చేయిస్తున్నామని చెబుతున్నారు తప్ప ఆచరణలో సాధ్యం కావడం లేదన్నారు. అలాగే కోతుల బెడద తీర్చడానికి మున్సిపల్ సమావేశంలో తీర్మానం చేయాల్సి ఉంది. కానీ ఇటీవల మున్సిపల్ సమావేశం నిర్వహించక పోవడంతో ప్రజలు, కుక్కలు, కోతుల బెడదతో నరకయాతన పడుతున్నారు. పట్టణంలోని సిద్దులగుట్ట, పోచమ్మగుట్టలో నివసిస్తున్న కోతులు వాటి ఆకలి దాహార్తిని తీర్చుకోవడానికి మీదిబజార్, కిందిబజార్, ఔట్‌గల్లీ, హుస్నాబాద్‌గల్లీ, రాంనగర్, జిరాయత్‌నగర్‌లతో పాటు మామిడిపల్లి ప్రాంతాల్లో సంచరిస్తున్నాయి. దీంతో ఆయా కాలనీల్లో వేకువ జాము నుంచి కోతుల బెడదతో, అలాగే రాత్రి 8 గంటల నుంచి కుక్కల బెడదతో పిల్లలను బయటకు పంపించలేని దుస్థితి ఏర్పడింది. ప్రతీ ఇంటి వద్ద ఒక పెద్ద కర్రను ఏర్పాటు చేసుకొని కుక్కలు, కోతుల భారీ నుంచి సంరక్షించుకుంటున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు కుక్కలు, కోతుల బెడద నుంచి సంరక్షించాలని ప్రజలు వేడుకుంటున్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

ఉన్నత చదువులను అభ్యసించాలి

కామారెడ్డిటౌన్,నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని ఉన్నత చదువులను అభ్యసించాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో మౌలానా అబ్దుల్‌కలాం ఆజాద్ జన్మదినం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థుల డైట్ చార్జీలు పెంచడం జరిగిందని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించేవిధంగా చదువుకోవాలని తెలిపారు. ఐఐటీ, ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించే విధంగా కృషిచేయాలని తెలిపారు.అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ,మైనార్టీ సంక్షేమ అధికారి దయానంద్, ఆర్ఎల్‌సీ కిరణ్‌గౌడ్, ఇంటర్‌నోడల్ అధికారి సలాం, ప్రిన్సిపల్ ప్రణిత తదితరులు పాల్గొన్నారు.

● ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పౌరసరాఫరాలు,మార్కెటింగ్ తదితర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతంచేయాలని, కొనుగోళ్లుచేసిన ధాన్యాన్ని సంబంధిత రైస్‌మిల్లులకు తరలించాలని, ట్యాబ్ ఎంట్రీలు త్వరగా చేయాలని తెలిపారు. రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కొనుగోలుచేసిన ధాన్యంకు త్వరగా చెల్లింపులు జరిగేలా చూడాలని తెలిపారు. టార్పాలిన్, గోనె సంచులు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్‌రూంకు వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా పౌరసరాఫరాల మేనేజర్ రాజేందర్,ఇంచార్జ్ జిల్లా పౌరసరాఫరాల అధికారి నరసింహరావు,మార్కెటింగ్ అధికారిణి రమ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెద్ద కొడప్‌గల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బిచ్కుంద మండలంలోని కథ్‌గాం గ్రామం నుంచి అక్రమంగా ఇసుక పెద్ద కొడప్‌గల్ మీదుగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులకు అప్పగిస్తామని తెలిపారు.

పశువైద్య శిబిరంలో గాలికుంటు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

పెద్ద కొడప్‌గల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చావుని తాండలో సోమవారం పశువైద్య శిబిరంలో భాగంగా పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఓఎస్ సురేష్ మాట్లాడుతు పశువైద్య శిబిరంలో 188 గేదేలు, 77 ఆవులకు టీకాలు వేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాల మిత్రలు గంగారాం, రవి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రిలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

నాగిరెడ్డిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా మండలంలోని తాండూరు గ్రామంలో గల త్రిలింగేశ్వర ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయాన్ని దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కార్తీక దీపారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో దేవాలయాన్ని దర్శించుకుని దీపారాధన చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి వచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు దత్తు తెలిపారు.

ఆలయంలో కార్తీక మాస పూజలు

పెద్ద కొడప్‌గల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాపనేశ్వర ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో సోమవారం శివయ్యకు ఇష్టమైన రోజు కావడంతో మహిళలు ఉదయం 5 గంటలకే ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లింగంపేటలో..

లింగంపేట, నవంబర్, 11: (ఆంధ్రజ్యోతి) లింగంపేట మండలంలో కార్తీక సోమవారం పురస్కరించుకొని అన్ని గ్రామాలలో ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా మహిళలు ఆలయాల్లో కార్తీక దీపాలను వెలిగించారు. మండల కేంద్రంలోని నగరేశ్వర ఆలయం, రామలింగేశ్వర ఆలయం, ప్రభుస్వామి ఆలయం, తో పాటు పొల్కంపేట, అయ్యపల్లి, మెంగారం, కొర్పోల్ గ్రామాలలోని శివాలయాలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

ఇంటింటి సమగ్ర సర్వేను పక్కాగా నిర్వహించాలి



కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ మహేందర్



అధికారులతో మాట్లాడుతున్నకలెక్టర్

కామారెడ్డిటౌన్,నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇంటింటిసమగ్ర సర్వేను పక్కగా ఏ ఒక్క ఇళ్లు కూడా విడిచిపెట్టకుండా పకడ్బందిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం పట్టణంలోని 44 వ వార్డులో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఎన్యుమరేటర్‌లు పక్కగా సమాచారం సేకరించాలని, ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని అన్నారు. ప్రతి ఎన్యూమరేటర్ రోజుకు 15 నుంచి 20 ఇళ్లలో సమాచారాన్ని సేకరించే విధంగా వేగవంతంగా నిర్వహించాలని తెలిపారు.సూపర్‌వైజర్‌లు ఎన్యూమరేటర్‌లకు తగు సలహాలు, సూచనలు, సహకారం అందించాలని తెలిపారు.అదేవిధంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ ఇంట్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సర్వే వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ రంగనాథ్‌రావు, తహసీల్దార్ జనార్ధన్, ఇంచార్జ్‌మున్సిపల్ కమీషనర్ పాల్గొన్నారు.

● ఎన్యుమరేటర్ సర్వేను అధికారులు పర్యవేక్షించాలి

కామారెడ్డిటౌన్: ఎన్యుమరేటర్‌లు నిర్వహించే సర్వేను సూపర్‌వైజర్‌లు, ప్రత్యేకాధికారులు పర్యవేక్షణ చేయాలని,రోజువారి నివేదికలను అప్‌లోడ్‌చేయాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మండలాల ప్రత్యేకాధికారులతో వీడి యో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కుటుంబసమగ్ర సర్వేకు అవసరమైన సిబ్బందిని నియమించుకుని ప్రతిపాదనలు సమర్పించాలనివెంటనే ఆమోదిస్తామని తెలిపా రు. ప్రతిరోజు సా యంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని, నివేదికలు అప్‌లోడ్ చేయాలని తెలిపారు.

● కుటుంబ సర్వేను పరిశీలించిన తహసీల్దార్

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఎల్లారెడ్డి తహసీల్దార్ మహేందర్ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ కుటుంబ సభ్యుల వివరాలు జాగ్రత్తగా నమోదు చేయా లని అదే విధంగా ప్రజలు కూడా ఎన్యూమరేటర్లకు సహకరించాలని తెలిపారు. ఆయనతో పాటు మెప్మా సిబ్బంది ఠాకూర్ తదితరులు ఉన్నారు.

సర్వేకు చేస్తున్న సిబ్బందికి ప్రజలు సహకరించాలి

దోమకొండ:సమగ్ర కుల గణన సర్వేకు ప్రతి ఇంటికి వస్తున్న ఎన్యూమరేటర్లకు మండల ప్రజలు సహకరించలాని మండల ప్రత్యక అధికారిణి జ్యోతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆమె సూపర్ వైజర్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వివిధ అంశాలపై వివరించారు.ప్రజలు తమ ఇంటికి వచ్చిన ఎన్యూమరేటర్‌కు తమ ఆధార్, పట్టాపాస్‌బక్, రేషన్‌కార్డు అందుబాటులో పెట్టుకుని వివరాలను తెలియజేయలన్నారు.సర్వేకు ప్రజలు సహకరించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, సూపర్‌వైజర్‌లురాజు, శంకర్, రేఖ ప్రకాశ్, శ్రీకాంత్,వరప్రసాద్,మాణిక్యారావు, శ్రీకాంత్, శేఖర్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

పిట్లం:కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ఇంటింటి కుటుంబ సర్వేను స్వాగతిస్తున్నామని జాతీయ బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర ఉపా ధ్యక్షుడు సుదర్శన్ అన్నారు. ఈకార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం కార్యదర్శి సంతోష్, ఆకుల లక్ష్మణ్‌యాదవ్, రాజేం దర్, బాబాగౌడ్, హన్మండ్లు, దయానంద్, శివ, నాయకులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్: మండలంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను పొరపాట్లు లేకుండా నిర్వహించాలని ఆర్ఐ అంజయ్య తెలిపారు. సోమవారం మండలంలోని బేగంపూర్‌తండాలో నిర్వహిస్తున్న సర్వే తీరును పరిశీలించారు. కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేసే సమయంలో జాగ్రత్తగా పూరించాలని సూచించారు. సర్వే నిర్వహించే సమయంలో ఏమైనా సందేహాలుంటే సంబంధిత అధికారులకు అడిగి సందేహాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శిఇందల్, ఎన్యుమరేటర్ శోభ పాల్గొన్నారు.

లింగంపేట: మండలంలో నిర్వహించే సమగ్ర సర్వే తప్పుల్లేకుండా చేపట్టాలని మండల పంచాయితీ అధికారి మలహరి అన్నారు. సోమవారం మండలంలోని ఐలాపూర్‌లో నిర్వహించిన సమగ్ర సర్వేను పరిశీలించారు. సమగ్ర సర్వే భవిష్యత్తుకు అవసరం ఉన్నందున ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలన్నారు.

తాడ్వాయి: మండలంలోని కృష్ణాజివాడి గ్రామంలో కుల గణన సామాజిక ఆర్థిక సర్వేను సోమవారం మండల ప్రత్యేక అధికారి రాజారాం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో ప్రతి ఒక్కరు కుటుంబ కులగణన సర్వేకు సహకరించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంఈవో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఘనంగా మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి వేడుకలు



లింగంపేటలో అబుల్ కలాం చిత్రపటానికి పూల మాల వేస్తున్న ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్

లింగంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) లింగంపేట మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో సోమవారం జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా స్వతంత్ర భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రి స్వర్గీయ మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అబుల్ కలాం చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మార్కెట్‌కమిటీ చైర్మన్ రజిత మాట్లాడుతూ దేశ విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకవచ్చిన గొప్ప సంస్కరణ మూర్తిగా అభివర్ణించారు. అబుల్ కలాం జయంతిని విద్యార్థి దినోత్సవంగా, మైనార్టీ వెల్ఫేర్ దినోత్సవంగా జరుపుకోవడం హర్షించతగ్గ విషయమన్నారు. విద్యార్థులు చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకొంటూ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించి జీవిత లక్ష్యాలను చేరుకోవాలని అకాంక్షించారు. విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ వెంకట్‌రాములు, నాయకులు రఫీక్, మోహీద్, షానూర్, ఏదుల్, అర్షద్‌లతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలలో సోమవారం అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ మాట్లాడుతూ భారతరత్న కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి ఆజాద్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుర్మ సాయిబాబా, మాజీ వైస్ ఎంపీపీ నునుగొండ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదె తిరుపతి, పోచయ్య, ప్రిన్సిపాల్ షరీఫ్, రఫత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలు ప్రతీ ఒక్కరు పాటించాలి



సర్వే వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీవో

రామారెడ్డి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కలెక్టర్ అశిష్ సంగ్వాన్ సర్వే ఆదేశాలను ప్రతి ఒక్కరు పాటించాలని రామారెడ్డి ఎంపీడీవో ఏలేటి తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. రామారెడ్డి మండలంలోని 19 గ్రామ పంచాయితీల్లో, తండాల్లో సామాజిక ఆర్థిక సర్వేపై ప్రతి ఒక్కరూ అధికారులు బాధ్యత వహించి విధులు నిర్వహించాలని తెలిపారు. సోమవారం పలు గ్రామాల్లో జరుగుతున్న సర్వే పనులను పరిశీలించారు. గ్రామాల్లో అందరూ కూడా సర్వేకు వచ్చిన అధికారులకు సహకరించి తగిన సమాచారం ఇవ్వగలరని ఎంపీడీవో తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృత దేహం లభ్యం

నాగిరెడ్డిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జెగ్గ చెరువు ఒడ్డున గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం సోమవారం లభ్యమైనట్లు స్థానిక ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని జెగ్గ చె రువు వద్ద ఒడ్డున ఓ గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైంది. ఈ మృత దేహాన్ని గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి ఎస్సై మల్లారెడ్డి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతునికి సుమారు 45 సంవత్సరాల వయస్సు ఉంటుందని, మృతుడు లుంగీ, షర్ట్ ధరించి ఉన్నాడని, మృత దేహాన్ని ఎవరైనా గుర్తిస్తే వివరాల కోసం నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

కామారెడ్డిటౌన్,నవంబరు 11(ఆంధ్రజ్యోతి): భిక్కనూర్ మండలంలోని కాచాపూర్ మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమికపాఠశాలలో విధులు నిర్వహిస్తున్న బీ. శ్రీనివాస్, కాంతారెడ్డిలను సస్పెండ్ చేసినట్లు డీఈవో రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల పాఠశాలలోని విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం వల్ల ఈ చర్యలు తీసుకున్నట్లు డీఈవో తెలిపారు.

వినియోగం లేని వాహన సామగ్రి వేలం

కామారెడ్డిటౌన్,నవంబరు 11(ఆంధ్రజ్యోతి):వినియోగానికి పనికిరాకుండా పడి ఉన్న పోలీసు మోటార్ వాహనాల, మోటార్ సైకిల్‌ల టైర్లు, ట్యూబల్‌లు,ఇంజన్ ఆయిల్, బ్యాటరీలు ఇతర సామాగ్రిని వేలం వేయనున్నట్లు ఎస్‌పీ సింధూశర్మ తెలిపారు. ఈనెల 20 న ఉదయం 11గంటలకు వేలం నిర్వహిస్తున్నామని తెలిపారు.బహిరంగ వేలంలో పాల్గొనాలనుకునేవారు వారికి సంబంధించిన ఆధార్, గుర్తింపుకార్డులు, ఇతర వివరాలు గల పత్రాలు వారి వెంటతీసుకుని రావాలని తెలిపారు. ఇతర వివరాల కోసం 8712686114 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

కల్లుగీత కార్మికుల ఉపాధికై చర్యలు చేపట్టాలి

కామారెడ్డిటౌన్,నవంబరు 11(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో ఐదులక్షల కుటుంబాలు కల్లుగీత కార్మిక వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని వీరి ఉపాధి మెరుగుపడే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ అన్నారు. సోమవారం మున్సిపల్ వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్లు గీతకార్మిక వృత్తి మెరుగుపడాలంటే ప్రధానంగా చెట్లపెంపకానికి భూమి ఇవ్వాలని, కల్లుకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని, నీరా,తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమ ఏర్పాటుచేయాలని తెలిపారు..ఈ కార్యక్రమంలో గీతకార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి అధికారులు హాజరుకావాలి

దోమకొండ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి):దోమకొండ మండలంలోని వివిధ శాఖలకు సంబంధించి మండల అధికారులు ప్రతి సోమవారం తహసీల్ కార్యాలయంలో జరిగే ప్రజావాణికి విధిగా హజరుకావాలని తహసీల్దార్ సంజయ్‌రావ్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్‌లు అన్నారు. కార్యక్రమంలో ఏపీవో రజని, అబ్కారీ పీసీ స్వాతి, హస్టల్ వార్డెన్ సరిత, ఇంచార్జ్ సీడీపీవో, ఆపరేటర్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్ల నిలిపివేత తిరిగి ప్రారంభం

మద్నూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మద్నూర్ మండల కేంద్రంలో ఉన్నటువంటి జిన్నింగ్ మిల్లు యజమానులు సోమవారం పత్తి కొనుగోళ్లను నిలిపివేశారు. దీంతో దూర ప్రాంతాల నుంచి పత్తి తీసుకువచ్చిన రైతులు ఇబ్బందులు పడ్డారు. తిరిగి ప్రభుత్వంతో చర్చలు సఫలం కావడంతో పత్తి కొనుగోళ్ళను ప్రారంభించారు. జిన్నింగ్ మిల్లుల యజమాను లకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారు నూతనంగా వి. దించిన నిబంధనల వల్ల సోమ వారం నుంచి తమ జిన్నింగ్ మి ల్లులకు తాళాలు వేసుకుని పత్తి కొనుగోలు నిలిపివేశారు. గతం లో మాదిరి కాకుండా ఎల్1, ఎల్2, ఎల్3 పేరుతో కొనుగోళ్ళ బాధ్యతలను విడుతల వారీగా చేపట్టాలని సీసీఐ నిర్ణయించ డంతో పత్తి జిన్నింగ్, ప్రెస్సింగ్, జాబ్ వర్క్‌ను సీసీఐ మూడు కేటాగిరిలుగా విభజించింది. అతి తక్కువ ధరకు జిన్నింగ్ చేసే మిల్లర్లను ఎల్1గా కాస్త ఎక్కువ కోట్ చేసిన వారికి ఎల్2, అధిక ధరకు జిన్నింగ్ చేస్తామనే వారిని ఎల్3 విభజించింది. తొలుత కొనుగోలు బాధ్యతలను ఎల్1 మిల్లర్లకు ఇస్తామని ప్రకటించింది. తొలుత కొనుగోలు బాధ్యతలను ఎల్1 మిల్లర్లకు ఇస్తామని ప్రకటించింది. నిబంధనలకు సీసీఐ వెనుకడుగు వేయడంలో మండల కేంద్రంలో యజమానులు పత్తి కొనుగోలు నిలిపివేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వంతో చర్చలు జరిపిన జిన్నింగ్ మిల్లు యజమానులు సీసీఐతో చర్చలు సఫలం కావడంతో తిరిగి మధ్యాహ్నం నుంచి పత్తి కొనుగోళ్ళను ప్రారంభించారు.



పత్తి కొనుగోళ్లను నిలిపివేసిన యజమానులు

పత్తిపై ప్రైవేట్ పెత్తనం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయి.తేమ కొర్రి చూపుతూ కోతవిధించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తునే ఉన్నారు. తేమశాతం రాక సీసీఐ కేంద్రాల నిర్వాహకులు కొనుగోలుచేయకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు కాపాలకాయలేక పత్తిని ప్రైవేట్ వ్యాపారులు, దళారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న దళారులు, ప్రైవేట్ వ్యాపారులు రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

సన్న వడ్ల పరిశీలించిన వ్యవసాయ అధికారులు



సన్న వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

నిజాంసాగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన సన్న ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం మండలంలోని నర్సింగరావుపల్లి గ్రామంలో సన్న వడ్లను పరిశీలించారు. రైతులు పండించిన వరి ధాన్యం రైతుల వివారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సన్న ధాన్యాన్ని ఏ మేలు రకం ఉన్నాయా లేదా అని రైతులు వేసిన ధాన్యం కుప్పలను పరిశీలించారు. ప్రభుత్వం క్వింటాల్‌కు 2320 రూపాయల చొప్పున కొనుగోలు చేస్తుందని సన్నా ధాన్యం ప్రభుత్వంకు రూ.500 బోనస్ ఇస్తుందని వ్యవసాయ శాఖ అధికారి అమర్ ప్రసాద్ తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ విస్తీర్ణ అధికారిణి స్వర్ణలత, మాజీ సర్పంచ్ రైతులు ఉన్నారు.

అగ్ని ప్రమాదం జరుగకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలి



నాగిరెడ్డిపేట అగ్ని ప్రమాదం నివారణ గురించి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నాగిరెడ్డిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ప్రతి ఒక్కరు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎల్లారెడ్డి అగ్ని మాపక అధికారి కిష్టయ్య కోరారు. ఆయన సోమవారం మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ముందుగా ప్రతి ఒక్కరూ అగ్ని ప్రమాదం జరుగకుండా చూసుకోవాలని, ఒకవేళ ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవిస్తే, వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని, అగ్ని మాపక కేంద్రానికి వెంటనే సమాచారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ నరేందర్, సిబ్బది ప్రవీణ్, బాల్‌రాజ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుల ఆందోళన

మద్నూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మద్నూర్ మార్కెట్‌లో పత్తి జిన్నింగ్ మిల్లు యజమానులు కొనుగోళ్ళను నిలిపివేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సీసీఐ గతంలో ఇచ్చిన నిబంధనలు పక్కనపెట్టి మరో విధంగా నిబంధనలు పెట్టడంతో జిన్నింగ్ మిల్లు యజమానులు మద్నూర్ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్ళను నిలిపివేశారు. ఆరు గాలం శ్రమించి పత్తిని పండించిన రైతులు ఆందోళన చెందారు. మెదక్, నారాయణఖేడ్, గాంధారి ప్రాంతాల నుంచి పత్తి తీసుకువచ్చిన రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వంతో జిన్నింగ్ మిల్లు యజమానుల చర్చలు సఫలం కావడంతో మధ్యాహ్నం నుంచి పత్తి కొనుగోళ్ళను తిరిగి ప్రారంభిం చారు. దూర ప్రాంతాల నుంచి పత్తి తీసుకువచ్చిన రైతులు హర్షం వ్యక్తంచేశారు.

ఆక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు

పిట్లం నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే అలాంటి వారిపై చట్టా రిత్యా కేసులు చేపడతామని ఎస్సై రాజు తెలిపారు.సోమవారం ఎస్సై మాట్లాడుతూ మండలంలోని మద్దెల్ చెరు గ్రామం వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా ఆక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టాక్టర్‌లను పట్టుకొని కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మత్సకారులకు చేప పిల్లల పంపిణీ

● మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ


పిట్లం నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మత్సకారులకు చెరువులలో చేపపిల్లను ఉచితంగా పంపిణీ చేస్తుందని మత్సకారసంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు.పిట్లంలో వ్యవసాయమార్కెట్ కమిటీ అధ్యక్షుడు మనోజ్ కుమార్ చెతుల మీదుగా మత్సకారులకు చెపపిల్లలను అందజేశారు. ఈసం దర్బంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ మండలంలో 8లక్షల 64 వెల 678 చేపపిల్లలను పంపిణీ చేశామన్నారు. ఈకార్యక్రమంలో మార్కెట్‌కమిటి ఉపాధ్య క్షుడు కృష్ణారెడ్డి, సహకారసంఘం చైర్మెన్ శపథంరెడ్డి, నాయకులు మొహన్‌రెడ్డి, సురత్‌రెడ్డి, ఎంపీడీవో కమలాకర్, బోడ్ల రాజు, ఇమ్మురోజ్, దత్తు, హన్మడ్లు, పోచయ్య, మత్స్యకారులు పాల్గొన్నారు.

బీబీపేట కేజీబీవీ ఎస్‌ఓను సస్పెండ్‌చేయాలి

కామారెడ్డిటౌన్,నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బీబీపేట కేజీబీవీ పాఠశాల ఎస్ఓను వెంటనే సస్పెండ్‌చేసి విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించకుండా పురుగులు,రాళ్లు వచ్చే ఆహారాన్ని పెడుతున్నారని ఆరోపించారు. ఎస్ఓపై తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

నిజాంసాగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహ్మద్‌నగర్ మండలంలని గిర్ని తండాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మహ్మద్‌నగర్ వ్యవసాయ శాఖ అధికారిణి నవ్య సోమవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న సన్న వరి ధాన్యాన్ని పరిశీలించి రైతు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఏఈవో రేణుక, సెంటర్ ఇంచార్జి సారిచంద్, రైతులు ఉన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

శాంతి	- లక్కీ భాస్కర్
దర్శన్	- అప్పుడో ఇప్పుడో ఎప్పుడో
ప్రియా 35	- అమరన్
ప్రియా 70	- క

బాన్సువాడ

మహేశ్వరి	- లక్కీ భాస్కర్
వెంకటేశ్వర	- అమరన్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

